తలచిన దొకటి.....!

రచన :
సి యచ్, గిరిజకుమారి.

శ్రీమతి ఆరోగ్యం బాగా లేనందువలన ఇంట్లో టిఫిన్ చేయవద్దని ఆరోజు ఉదయాన్నే సంచి తీసుకుని హోటల్ కి బయలుదేరాను.

ఏమండోయ్, నాలుగుదోసెలు, రెండుఇడ్లీ తీసుకురండని, పెద్దగా చెప్పింది శ్రీమతి.

అలానే లేవోయ్, అన్నాను చెప్పులేసుకుంటూ.

ఏమండోయ్.....

మళ్ళీ, ఏంటి? అన్నాను కొంచెం విసుగ్గా.

ఏంలేదుగానీ, మీరు అక్కడతిని వస్తారా? లేక ఇంటికే తెచ్చుకుంటూరా? సందేహం బయటపెట్టింది.

నేను ఆఫీసుకి వెళ్ళేటప్పుడు తిని వెళతానే, ఇప్పుడు మీకు మాత్రమే తెస్తానని, చెప్పి సైకిలు తీసుకొని బయటకు వెళ్ళాను.

• • •

ఏమండోయ్! మీరు తిని వెళ్ళతారా? శ్రీమతి ప్రశ్న విన్న నాకు చిరాకు పుట్టుకొచ్చింది. ఎన్నిసార్లు చెప్పాలినే ఆఫీసుకి వెళ్లేటప్పుడు తిని వెళతానని చెప్పాను కదా! బాత్ రూమ్‌లో నుండే సమాధానం చెప్పాను.

మరి ఐదు దోసెలు ఎందుకు తెచ్చారు?

ఏమిటీ! ఐదుతేలేదే, నాలుగే తెచ్చాను సరిగా లెక్కపెట్టు.

లేదండి, ఐదు వున్నాయి కావాలంటె చూడండి.

నేను హడావుడిగా బాత్ రూమ్ నుండి వచ్చి చూస్తే శ్రీమతి చెప్పింది నిజమే, అయిదున్నాయి.

సరిగా గుర్తు తెచ్చుకోండి అయిదు కట్టమన్నారేమో అంది శ్రీమతి.

వూహు, అలా అనలేదు నేను నాలుగే చెప్పాను, లక్ష్మీ! అన్నాను ఎక్కడ పొరపాటు జరిగి వుంటుందా అని ఆలోచిస్తూ.

సరే పొన్లేండి, మీరూ తినేసి వెళ్ళండి, అంది శ్రీమతి.

ఛా, ఛా, ఏదో పొరపాటున ఐదు ఇచ్చి వుంటాడు, మనం ఇచ్చాడు కదా అని తినటమేనా? అది అలానే వుంచు నే వెళ్ళేటప్పుడు హోటల్‌లో ఇచ్చేసి వెళతా అని చెప్పి ఆఫీసుకి వెళ్ళేటప్పుడు దోసెని స్కైకిల్ వెనుక పెట్టుకొని బయలు దేరాను.

హోటల్ కి వెళ్ళి మేనేజరుకి దోసె ఇచ్చి విషయం చెప్పాను. అది విన్న ఆ దగ్గర్లోకూర్చుని వున్న వాళ్ళు, ఎంత నిజాయితి అండీ! ఈ రోజుల్లో ఎవరండి ఇలా తెచ్చిఇచ్చేది!?

అవును, ఇచ్చిందే చాలని వూరుకుంటారుగానీ తెచ్చిఇద్దామనుకునేది ఎవరండి!

ఇలా వ్యాఖ్యానాలు సాగిపోతున్నాయి. అందరు నా నిజాయితిని పలురకాలుగా పొగుడుతున్నారు.

ఆ మరునాటినుండి నేను హోటలుకి వెళ్ళగానే ఒరేయ్ సుబ్బారావ్ గారికి మంచి టేబుల్ చూపించండి, మాడకుండా మంచి పెసరట్టు వేసివ్వండని ఆర్డర్లు వేస్తున్నాడు మేనేజరు. సుబ్బారావ్ మనసు ఆనందంతో గంతులేస్తోంది.

సైకిల్ ముందు నుండి కుక్క 'భౌ' మని

అరుస్తూ వెళ్ళగానే, కలలో నుండి వాస్తవం లోకి వచ్చాను, నా వూహులకి నవ్వుకున్నాను. నేనింకా హోటల్‌కి వెళ్ళలేదు. నా మనసు మాత్రం వెళ్ళి వచ్చిందని అనుకొని, త్వరత్వరగా సైకిల్ త్రొక్కి హోటల్‌కి చేరుకున్నా గబ గబా కౌంటర్ దగ్గరకు వెళ్ళి దోసె కౌంటరు మీద పెట్టాను.

హోటల్ ప్రొప్రయిటర్ రంగనాథం నా వంకా, దోసెవంకా ఓసారి చూసి ఏమిటన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించాడు.

"నేను నాలుగు దోసెలు కట్టమంటే, ఐదు కట్టారండి, ఇంటికి వెళ్లి చూసుకున్నాక, తెలిసింది అందుకని అది తెచ్చాను" అని చెప్పి చుట్టూచూశాను.

అక్కడకూర్చున్న వాళ్ళంతా నా వంక ప్రశంసిస్తున్నట్లు చూశారు. నేనెంతో గర్వంగా ఫీలయ్యాను.

రంగనాథం బెల్ నొక్కి "ఎవడ్రా ఈ యనకు పార్సిల్ కట్టింది" అని గట్టిగా అరిచాడు.

లోపలనుండి ఎవరో, "అప్పారావ్ సార్" అని చెప్పాడు.

"వాడ్నిట్లా, తగలబడమను" కోపంగా అన్నాడు రంగనాథం. నేను అయోమయంగా ఆయన వంక చూస్తూన్నా.

"అవున్రా! ఈయన నాలుగు దోసెలు కట్టివ్వమంటే ఐదు దోసెలు ఇచ్చావుట్రా? ఇలా ఎన్నాళ్ళనుండి, ఎంత మందికి ఇస్తున్నావ్?" గద్దించాడు రంగనాథం.

"పొరపాటయిందండి" బెదిరిపోయి వణుకుతూ అన్నాడు అప్పారావ్.

"ఈరోజు తెలిసింది కాబట్టి పొరపాటు అంటున్నావు. తెలియనివి ఎన్ని చేసావో! అయినా పనిచేసేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని చేయాలా, ఇలా చేస్తూవుంటే నేను, నా హోటల్ తెల్లగుడ్డ వేసుకోవాల్సి వస్తుంది, ఈరోజువరకు నీకు రావలసిన జీతం, తీసుకుని వెళ్ళిపో" అన్నాడు ముక్కోపి అయిన రంగనాథం.

"క్షమించండి సార్, పొరపాటయిందండి ఇంకెప్పుడు జాగ్రత్తగానే వుంటానండి" అని అప్పారావు చెబుతున్నా వినిపించుకోలేదు రంగనాథం.

"ఏదో అయిపోయింది పొరపాటు అంటున్నాడుగా పోనీయండి సార్" అని నే సర్ది చెప్పబోయినా వినిపించుకులేదు రంగనాథం.

"మీరు మంచివారు కాబట్టి తెచ్చిచ్చారు అందరు ఇలానే తెస్తారా? ఒకసారి ఇలా చేస్తే గానీ వాళ్ళకి బుద్ధిరాదు, మీరెళ్ళి కూర్చోండి సార్" అన్నాడు రంగనాథం.

మేనేజరు నోటినుండి వచ్చిన ప్రశంస నేను వూహించినదే అయినా, ఇలా జరుగుతుందని వూహించని నేను ఈ పరిణామానికి విస్తుపోయాను.

వెళుతూ అప్పారావ్ నా వంక చూసిన బేలచూపుకి నా మనసు చివుక్కుమంది. చుట్టూవున్న వాళ్ళంతా నావంక ఎంతో నిరసనగా చూస్తున్నట్లు అనిపించింది. ఆ సర్వరు వుద్యోగం పోవటానికి కారణం నేనే అన్న బాధ నాగుండెల్ని పిండేస్తుంటే, వికల మనస్కుడునై కాఫీకూడా త్రాగకుండా బయటకు వచ్చేసాను.